ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 13 అక్టోబరు 2025

నేడు యథావిధిగా ప్రజావాణి : కలెక్టర్

సిద్దిపేట అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నేడు (సోమవారం) యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హైమావతి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ సమయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించలేదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ లేకపోవడంతో ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లాలోని ప్రజలందరూ గమనించాలని, ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో అర్జీ పెట్టుకోవచ్చని పేర్కొన్నారు.

ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ సమీపంలోని హజ్‌రత్ మౌలానా అల్ హజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఉమర్ అల్ మారూఫ్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షా బంద నవాజ్ (ఇర్ఫానీ దర్గా) 23 ఉర్సు ఉత్సవాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆదివారం నాడు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజ్‌రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీమ్ ఖార్గా ఇర్ఫానీ నిర్మల రెడ్డికి సాదర స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫానీ దర్గాలో కుల మతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలు జరగడం సౌభ్రాతృత్వానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, ఉర్సు ఉత్సవాల నిర్వాహకులు అహ్మద్ బిన్ ఉమర్ ఇర్ఫానీ, షేక్ షకీల్ అహ్మద్ ఇర్ఫానీ, షబ్బీర్ అహ్మద్ ఇర్ఫానీ, హస్మీన్, సయిద్ బిన్ సాలేహ్, మహమ్మద్ బిన్ యహియా ఇర్ఫానీ, సలీమ్‌ఖాన్, మీర్ అసద్ అలీ ఇర్ఫానీ, అతర్ గౌస్వి తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డి సమీపంలోని ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

మా ఓటు.. అమ్మకానికి లేదు

- రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కు వినియోగించుకుంటాం
- గాంధీనగర్‌లో యువత తీర్మానం

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఓటును డబ్బుకు, మద్యానికి అమ్ముకోబోమని, రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ఆ గ్రామ యువత తీర్మానం చేసింది. ఆదివారం హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ అధికార దాహం కోసం విచ్చలవిడిగా డబ్బు, మద్యాన్ని కుమ్మరించి ఓట్లు దండుకుంటున్నారని, తద్వారా గ్రామాభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మనం చేసిన తప్పుకు మనమే బాధ్యులం కావాల్సిన దుస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న వ్యక్తి ఎవరైనా సరే డబ్బు పంచకుండా, ఓటరు కూడా డబ్బు, మద్యానికి ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా రాజ్యాంగబద్ధంగా తమ ఓటును వినియోగించుకుంటామని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీలం కుమార్, ఉపాధ్యక్షుడు జనగామ కమలాకర్‌రావు, అనిల్, గొర్ల రాంబాబు పాల్గొన్నారు.



తమ ఓటు అమ్ముకోబోమని తీర్మానం చేస్తున్న గాంధీనగర్ యువత, గ్రామస్థులు



మల్లన్న ఆలయంలో భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొమురవెల్లి/జగదేవ్‌పూర్ అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం సెలవు రోజు సందర్భంగా భక్తజనులు సందడి చేశారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో పట్నాలు వేసి బోనాలు చెల్లించారు. పలువురు భక్తులు ఆలయ ముఖ మండపంలో స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం మల్లికార్జున స్వామిని దర్శించుకొని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండపోచమ్మకు భక్తుల తాకిడి

జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మహేందర్ రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, చిన్న, హరి పాల్గొన్నారు.



కొండపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

చీరలు వచ్చేశాయ్!

- 'ఇందిరా మహిళా శక్తి' కింద మహిళా సంఘాల సభ్యులకు రెండేసి యూనిఫామ్ చీరలు
- జిల్లాలో 2.40 లక్షలకు గాను 1.37 లక్షల చీరలు డంప్
- నవంబరు 19న పంపిణీకి రంగం సిద్ధం

సిద్దిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులందరికీ "ఇందిరా మహిళా శక్తి" కింద రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్ చీరలను పంపిణీ చేయనుంది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కేంద్రానికి చీరలు విడతలవారీగా చేరుకుంటున్నాయి. వీటిని నవంబరు 19న ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని సంఘాల సభ్యులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సూచనలు జారీ చేసింది. ఆ దిశగా పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో సెర్ప్, మెప్మా కింద మొత్తంగా 22,558 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆ సంఘాల సభ్యులకు ప్రతి ఒక్కరికి రెండేసి చొప్పున యూనిఫామ్ చీరలు అందనున్నాయి. మొదటగా బతుకమ్మ పండుగకు అందిస్తారని మహిళా సంఘాల సభ్యులు భావించినప్పటికీ, పూర్తి స్థాయిలో చీరలు రాకపోవడంతో ఆలస్యమైంది.

ఒక్కో సభ్యురాలికి రెండేసి చొప్పున పంపిణీ

మహిళా సంఘంలోని సభ్యత్వం ఉన్న ప్రతి సభ్యురాలికీ రెండేసి చొప్పున రెండు రకాల యూనిఫామ్ చీరలను అందించనున్నారు. ఈ మేరకు సంఘంలోని సభ్యుల్లో అర్హులు ఎవరు, ఎంతమంది ఉంటారనేది అధికారులు ఆరా తీస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీపీవోలు, మున్సిపాలిటీలలో మెప్మా సిబ్బందికి ఈ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిసింది. 18 ఏళ్లు నిండిన యువతితో పాటు మహిళలకు, వృద్ధులకు ఈ చీరలు లభించనున్నాయి. విడతలవారీగా చీరలు వస్తుండడంతో జిల్లా కేంద్రమైన సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో భద్రపరుస్తున్నారు. పూర్తి స్థాయిలో చీరలు వచ్చిన తర్వాత గ్రామాలకు, పట్టణాలలో మున్సిపల్‌లోని మెప్మా సిబ్బందికి గోదాముల్లో నిల్వ చేసిన చీరలను పంపించనున్నారు. జిల్లాలో మొత్తంగా 22,558 మహిళా సంఘాలుండగా, దాదాపు 2.40 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీటిలో 18,315 సెర్ప్ సంఘాలుండగా.. మెప్మా కింద జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీల్లో 4,243 మహిళా సంఘాలు ఉన్నాయి. సెర్ప్ సంఘాల్లో 1.94 లక్షలకు పైగా సభ్యులుండగా, 45 వేల మందికి పైగా మెప్మాలో సభ్యులు ఉన్నారు. 2.40 లక్షల చీరలకు గాను ఇప్పటివరకు 1.37 లక్షల వరకు చీరలు రాగా, త్వరలోనే మిగతా చీరలు రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో చీరకు రూ. 800 మేర కాగా, రెండు యూనిఫామ్ చీరలకు కలిపి రూ. 1,600 మేర ఖర్చు అయినట్లు అధికారులు తెలిపారు.



సిద్దిపేటలోని గోదాంలో భద్రపరిచిన యూనిఫామ్ చీరలు

ఎన్నికల కోడ్ తొలగడంతో మార్గం సుగమం

బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులందరికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందించింది.

మిగతా 8వ పేజీలో

వినియోగంలోకి రైతుబజార్

- నేటి నుంచి చావడి వద్ద కూరగాయల విక్రయాలు
- అసంపూర్తిగా సమీకృత మార్కెట్ పనులు

హుస్నాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని చావడి వద్ద దాదాపు రూ.3కోట్లతో నిర్మించిన రైతుబజార్ సోమవారం నుంచి వినియోగంలోకి రానున్నది. అందుకు తగిన ఏర్పాట్లను మార్కెట్ అధికారులు పూర్తి చేశారు. ఈ రైతు బజార్‌ను ఏడు నెలల క్రితం ప్రారంభించినప్పటికీ, వినియోగంలోకి తీసుకురాలేదు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్‌కు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, సెకండ్ ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ నిర్మాణం చేశారు. మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు రైతు బజార్ వద్ద విక్రయించాలని, కూరగాయలు కొనుగోలు చేసే వినియోగదారులు కూడా ఇక్కడికి రావాలని పట్టణంలోని పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆకు కూరలు, కూరగాయలు హుస్నాబాద్‌కు తీసుకువచ్చి విక్రయించే రైతులు, పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను విక్రయించే చిరు వ్యాపారులను ఇక్కడికి తీసుకువచ్చి ఇక్కడి నుంచే క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం నుంచి దీనిని ప్రారంభించనున్నారు.



వినియోగంలోకి రానున్న రైతు బజార్



హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

రోడ్లపైనే మాంసం, కూరగాయల విక్రయం

హుస్నాబాద్ ప్రజలందరికీ మాంసం, చేపలు, ఆకు కూరలు, కూరగాయలు ఒక చోటే లభించాలనే ఉద్దేశంతో నిర్మించాలనుకున్న సమీకృత మార్కెట్ భవనం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. మొదట్లో ఆగుతూ.. సాగిన పనులు గత ఏడాదిగా మొత్తంగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? లేక అధికారుల అలసత్వమా? తెలియదు కాని సమీకృత మార్కెట్ భవనం అసంపూర్తి పనులతో దర్శనం ఇస్తున్నది. హుస్నాబాద్ పట్టణం రామవరం రోడ్డులోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎకరం స్థలంలో రూ. 2.75 కోట్ల నిధులతో సమీకృత మాంసాహార, శాఖాహార మార్కెట్ భవనానికి 2022 ఫిబ్రవరి8న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగాయి. పునాదుల నుంచి పిల్లర్ల నిర్మాణం వరకు పనులు చేసి నిలిపివేశారు. ప్రస్తుతం ఏడాది నుంచి మొత్తంగా నిలిచిపోయాయి. ఒకే చోట మాంసం, చేపలు, కూరగాయలు, ఇతర వస్తువులు లభించే విధంగా ఈ సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టినప్పటికీ ప్రజలకు ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం లేదు. దీంతో కూరగాయలు, మాంసం విక్రయాలు రోడ్లపైనే జరుగుతున్నాయి. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌ను పిలిపించి త్వరితగతిన పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దేశానికి సైనికులే రక్ష

- ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశానికి రక్షణ కల్పించేది సైనికులే అని, వారు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో జరుగుతున్న సిద్దిపేట జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశప్రజలు కడుపు నిండా తింటున్నారు, కంటి నిండా నిద్ర పోతున్నారు అంటే సైనికులే కారణమన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తే మీ పిల్లలు ఇక్కడ నాన్‌లోకల్ అవుతున్నారని, ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. తప్పక తమప్రభుత్వం వస్తుందని, ఎక్స్‌సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు.



ఎక్స్‌సర్వీస్‌మెన్‌లతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

వాసవీ క్లబ్ సేవలు వెలకట్టలేనివి

వాసవీ క్లబ్ ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట వైశ్యభవన్‌లో జరిగిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ శోభ శ్రీ వారి ప్రాంతీయ సదస్సు, వివిధ సేవల్లో ఎంపికైన వారికి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవంగా భావించే వాసవి అమ్మవారి ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు చేస్తున్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో అన్నీ ఎగవేతలే...

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని ఎగవేతలు, బంద్ చేసే కార్యక్రమాలు అని, మళ్లీ కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో 297 మందికి రూ.60లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 12వేల మందికి రూ.40కోట్ల సహాయం చేశామన్నారు. వివిధ కారణాలతో ఆసుపత్రిలో చేరి ఆర్థిక స్థోమత లేని వారికి ఉడతా భక్తిగా ఎంతో కొంత సహాయం ఈ చెక్కుల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మక్కలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. 8 నెలల నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగులకు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ ఖచ్చితంగా వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు.

పాత ఫోన్లతో అంగన్‌వాడీలు సతమతం

- సర్వేలు.. ఆన్‌లైన్ అటెండెన్స్‌తో అవస్థలు
- సాంకేతిక చిక్కులతో పెరిగిన పనిభారం
- కొత్త ఫోన్లు ఇవ్వాలని వేడుకోలు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లకు అందించిన పాత ఫోన్లు పనిచేయకపోవడంతో సర్వేల నిర్వహణలో తీవ్రంగా సతమతమవుతున్నారు. ముఖ్యంగా సర్వేలు, ఇతర నివేదికలన్నీ ఫోన్‌లోనే పూర్తి చేయాల్సి ఉండగా, అధికారులు ఇచ్చిన ఫోన్లు సరిగా పని చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సుమారు 8, 9 సంవత్సరాల క్రితం ఇచ్చిన పాత తరం (2జీ) ఫోన్లను ఇప్పటికీ వాడుతుండడంతో, నెట్‌వర్క్ సమస్యలు, ఫోన్ వేగం మందగించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కారణంగా సర్వేలు సకాలంలో పూర్తి చేయలేక టీచర్లు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి నెట్ సమస్య వల్ల సర్వే పూర్తి కాక, అదే పనిలో ఉండిపోవడంతో ఇతర ముఖ్య పనులు పెండింగ్‌లో పడుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలలో ఆపార్, అబాకాడ్, పోషన్ ట్రాకర్, అటెండెన్స్ వంటి ఎన్నో పనులు ఫోన్ ద్వారానే చేయాల్సి ఉంది. ఈ మధ్యలో ఫేస్ క్యాప్చర్ విధానం కూడా రావడంతో పనిభారం మరింత పెరిగి ఇబ్బందులు అధికమయ్యాయి. జిల్లాలో 1150 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గర్భిణులు 597 మంది, బాలింతలు 4917 మంది అలాగే 0 నుంచి 6 నెలల పిల్లల సంఖ్య 4539, ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లల సంఖ్య 30,732, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల సంఖ్య 31,801.

పెరుగుతున్న టెక్నాలజీకి అనుకూలంగా ర్యామ్ పెంచి 5జీ నూతన స్మార్ట్ ఫోన్లను అందించాలని గతంలో సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి

అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు గుర్తించాలి. ఫోన్ సమస్యపై తక్షణమే స్పందించి నూతన స్మార్ట్‌ఫోన్‌లను అందించాలి. ఈ విషయమై ఇప్పటికే సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాం. అనేక వినతిపత్రాలను కూడా అందించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

\- గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి



జూదం స్థావరంపై పోలీసుల దాడి

● రూ.3.29 లక్షల నగదు స్వాధీనం


నిందితులను చూపుతున్న పోలీసులు

వెల్దుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జూదం స్థావరంపై వెల్దుర్తి పోలీసులు దాడి చేసి భారీగా నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో పది మంది పరారైనట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపారు. ఈ ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఉదయం వెల్దుర్తి ఎస్సై రాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో ముగ్గురిని పట్టుకోగా, సుమారు పది మంది పరారయ్యారు. జూదం ఆడుతున్న సమయంలో ఉన్న రూ.3,29,500 నగదు, 8 సెల్‌ఫోన్లు, 5 బైకులను ఎస్సై రాజు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తూప్రాన్ సీఐ రంగకృష్ణ హెచ్చరించారు. జూదం ఆడటం వలన గ్రామాలలో చట్టం, శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

కలప అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన కలప ట్రాక్టర్

తూప్రాన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా చెట్లను నరికి తరలిస్తున్న కలప ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... తూప్రాన్ పట్టణంలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద కలప వ్యాపారులు అనుమతులు లేకుండా చెట్లను అక్రమంగా నరికివేశారు. నరికిన కలపను ట్రాక్టర్‌లో నింపి తరలించడానికి సిద్ధం చేశారు. ప్రజలు ఫిర్యాదు చేయడంతో అటవీ శాఖ తూప్రాన్ సెక్షన్ ఆఫీసర్ ఓంప్రకాశ్ అక్కడికి చేరుకుని కలప ట్రాక్టర్‌ను మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద గల తూప్రాన్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా చెట్లు నరికివేత, ట్రాక్టర్ తరలింపునకు సంబంధించి సోమవారం కేసు నమోదు చేయనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.









ముంపుతో ముప్పు.. కాలుష్యంతో కంపు


గండిచెరువు అలుగు ఎత్తు పెంచడంతో పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం

● గండిచెరువులో పరిశ్రమల రసాయన వ్యర్థాలు.. బ్యాక్ వాటర్‌తో దుర్గంధం

జిన్నారం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి గండిచెరువు బ్యాక్ వాటర్‌తో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చెరువులో చేరిన పరిశ్రమల రసాయన వ్యర్థాలతో పాటు, అలుగు ఎత్తు పెంచడం వలన పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం దీనికి కారణం. చెరువు పైభాగంలో ఉన్న రసాయన పరిశ్రమల నుంచి నిత్యం వ్యర్థ రసాయనాలు వచ్చి చెరువులో చేరుతుంటాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద నీటితో కలిసి పెద్ద మొత్తంలో కాలుష్య జలాలు చెరువులో చేరాయి. ప్రస్తుతం గండిచెరువు నీటిని వ్యవసాయానికి వినియోగించడం లేదు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం సమయంలో చెరువు అలుగు ఎత్తును 4 అడుగుల మేర పెంచడం వలన నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. దీనితో చెరువు బ్యాక్ వాటర్ గ్రామ శివారు వరకు చేరి కొన్ని పట్టా భూములు నీట మునిగిపోయాయి. నీటిలో చేరిన రసాయనాల కారణంగా తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చెరువులోకి కాలుష్య జలాలు చేరకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే అలుగు ఎత్తును తగ్గించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


కాజీపల్లి గ్రామ శివారు నివాసాల సమీపంలో చెరువు బ్యాక్ వాటర్


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తండావాసులు

ఎక్సైజ్ అధికారులే దాడి చేశారు

● చల్లగిద్ద తండా గిరిజనుల ఫిర్యాదు


ఎక్సైజ్ అధికారుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వడిత్యా మోహన్

నారాయణఖేడ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తున్నారనే నెపంతో తమ తండాపై ఎక్సైజ్ అధికారులు దౌర్జన్యం చేసి, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించారని, కొందరిని విచక్షణా రహితంగా కొట్టారని నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండా గిరిజనులు ఆరోపించారు. సివిల్ డ్రెస్సుల్లో వచ్చినవారు ఎవరో తమకు తెలియదని, వారు ఇళ్లల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేశారని గిరిజనులు పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, మెడపై చేయి వేసి జుట్టు పట్టుకుని లాగారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై దౌర్జన్యం చేసిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోమణిబాయి, చావుళీబాయి, సునీత, భూలిబాయి, రేణుక, సునీతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వడిత్యా మోహన మాట్లాడుతూ... తనను ఎక్సైజ్ అధికారులు విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపించారు. అధికారులు ఇంట్లోకి ప్రవేశించి పెట్టెలు ధ్వంసం చేశారని, చెరుకు నరికేందుకు అడ్వాన్స్‌గా తెచ్చుకున్న రూ.2లక్షల నగదు, పట్టా పాసుపుస్తకాలు సైతం తీసుకువెళ్లారని గిరిజనులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అగ్నిప్రమాదంలో పూరిగుడిసె దగ్ధం

●రోడ్డున పడిన నిరుపేద కుటుంబం


కాలిపోయిన నివాస పూరిగుడిసె

తూప్రాన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దంపతులు కూలి పనులకు వెళ్లగా, పిల్లలు పక్కింటి వద్ద ఆడుకుంటున్న సమయంలో నివాస పూరి గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, ఇంట్లోని సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన తూప్రాన్ మండలం వెంకటరత్నాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. వెంకటరత్నాపూర్‌కు చెందిన గౌడెల్లి రాజు, రజిత దంపతులు ఇద్దరు పిల్లలతో పూరి గుడిసెలో నివాసముంటూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో దంపతులు పనికి వెళ్లగా, పిల్లలు పక్కింటి వద్ద ఉన్నారు. ఒక్కసారిగా గుడిసెలో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రజలు గుర్తించి ఆర్పివేశారు. అయినప్పటికీ గుడిసె పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. దీంతో రాజు, రజిత కుటుంబం రోడ్డున పడింది. ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

బస్సు ఢీకొని సెక్యూరిటీగార్డు మృతి

పటాన్‌చెరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళుతున్న సెక్యూరిటీ గార్డును కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఇస్నాపూర్ పురపాలక కేంద్రంలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ (56) పాశమైలారం పారిశ్రామిక వాడలోని అప్తా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శనివారం రాత్రి సమయంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేస్తుండగా కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు ఉదయ్‌భార్గవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

హవేళిఘణపూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఫరీద్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన చింతల రాజయ్య(77) ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని ఊర చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఆయన నీటిలో పడి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఏడుగురు పేకాట రాయుళ్లపై కేసు

కల్హేర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామంలో నడిరోడ్డుపై పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్సై మధుసూధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి గస్తీ తిరుగుతున్న సమయంలో గ్రామంలోని పుట్టి సంగయ్య ఇంటి ముందు ఉన్న సిమెంట్ రోడ్డుపై ఏడుగురు పేకాట ఆడుతుండగా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రూ.3070 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

యువతి అదృశ్యం


పింకిబాయి(ఫైల్)

పటాన్‌చెరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కిరాణాషాపుకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలో నివాసం ఉంటున్న సభావత్ పింకిబాయి ఆదివారం మధ్యాహ్నం కిరాణా షాపుకు వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోయింది. సోదరుడు సభావత్ వసుదేవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంతర్గాంలో మహిళ..


శాంతమ్మ(ఫైల్)

కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు సిర్గాపూర్ ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కోట శాంతమ్మ(24) ఈ నెల 10న రాత్రి 9 గంటల నుంచి కనిపించడం లేదని తెలిపారు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి లక్ష్మణ్‌గౌండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

రెండు ప్రైవేటు పాఠశాలల బస్సులపై కేసు


ఆర్టీఏ అధికారుల అదుపులో స్కూల్ బస్సు

కంది, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ప్రైవేటు పాఠశాల బస్సులను సెలవు రోజుల్లో శుభకార్యాలకు జనాలను తరలించడానికి వాడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఆదివారం జహీరాబాద్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన 54 సీట్ల సామర్థ్యం గల రెండు బస్సులను శంకర్‌పల్లిలో ఓ పెళ్లికి జనాలను తరలించడానికి బుక్ చేశారు. పాఠశాల యాజమాన్యం అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఈ బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు గుర్తించారు. తాము ప్రతి సంవత్సరం రోడ్డు పన్ను చెల్లించి ట్యాక్సీ వాహనాలను నడుపుతుంటే, ప్రైవేటు పాఠశాల బస్సులు తక్కువ ధరకు కిరాయికి వెళ్లడం వలన నష్టపోతున్నామని ఆ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఎం.డి. జుబేర్, వడ్ల వరకుమార్, సందీప్ రెడ్డి, కృష్ణ, నతీష్, రమణారెడ్డి ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీఏ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ ఆదేశాల మేరకు ఏఎంవీఐ చందన సిబ్బందితో కలిసి కంది పరిధిలో ప్రైవేటు స్కూల్ బస్సులను పట్టుకున్నారు. కందిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి తరలించి డ్రైవర్లను విచారించగా, సెలవు రోజుల్లో బస్సులను శుభకార్యాలకు వినియోగిస్తున్నట్లు తేలింది. దీంతో ఏఎంవీఐ చందన ఆ రెండు బస్సులపై కేసు నమోదు చేసి, జరిమానా విధించారు.

శంకరా.. కోటిన్నర..!

రూ.1.50 కోట్లతో నిర్మాణం.. నిరుపయోగంగా మహా ప్రస్థానం

- రెండేళ్లు గడిచినా పూర్తికాని పనులు
- కనీస వసతులు లేక పాత శ్మశానవాటికనే ఆశ్రయిస్తున్న స్థానికులు
- శివాలయం, సీసీ రోడ్డు నిర్మించినా పూర్తిస్థాయి పనుల్లో నిర్లక్ష్యం
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు.. శిథిలావస్థకు చేరుతున్న నిర్మాణాలు
- వినియోగంలోకి తేవాలని స్థానికుల డిమాండ్



మహాప్రస్థానంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నారాయణఖేడ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతిమ సంస్కారాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే ఉద్దేశంతో నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట శివారులో రూ.కోటిన్నర ఖర్చుతో నిర్మించిన మహాప్రస్థానం (ఆధునిక శ్మశాన వాటిక) నిరుపయోగంగా మారింది. పనులు పూర్తి కాకపోవడంతో రెండేళ్లుగా ఇది వినియోగంలోకి రాలేదు. గత ప్రభుత్వం హయాంలో 2022 లో ఆర్టీసీ డిపో వెనుక దాదాపు ఒక ఎకరా విస్తీర్ణంలో ఈ మహాప్రస్థానం నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో ప్రహరీ గోడ, రెస్ట్‌రూమ్, స్నానపు గదులు, బర్నింగ్ బిట్స్ (దహన వేదికలు), తిమ్మిడిగల్లం గద్దె, శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే, లాకర్స్ సహా ఇతర మౌలిక వసతులు ఇంకా కల్పించాల్సి ఉంది. పనులు పూర్తి కాకపోవడం, అధికారులు దీనిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పరిసర ప్రాంత మంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది.



మహాప్రస్థానానికి వెళ్లే రోడ్డు

రోడ్డుకు రూ.50 లక్షలు ఖర్చు

మహాప్రస్థానానికి వెళ్లే రోడ్డు విషయంలో మాత్రం అధికారులు శ్రద్ధ చూపారు. ప్రధాన రోడ్డు నుంచి శ్మశానవాటిక వరకు రూ.50 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డును నిర్మించారు. అంతేకాక, రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లను పెంచడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. రోడ్డు నిర్మాణం పూర్తయినా, రూ.కోటిన్నర విలువైన మహాప్రస్థానాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో, ఎవరైనా మృతి చెందితే కనీస వసతులు లేని పాత శ్మశానవాటిక (సబ్ స్టేషన్ వెనుక భాగం) లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. త్వరలోనే పనులు పూర్తి చేసి, మహాప్రస్థానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



మహాప్రస్థానం ద్వారం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



మంగల్‌పేట శివార్లలో నిర్మించిన మహాప్రస్థానం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పనులు పూర్తి చేయించి, త్వరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

- దారం శంకర్, తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్

పనులు పూర్తి కాకపోవడం వల్లే..



నూతనంగా నిర్మించిన మహాప్రస్థానం పనులు పూర్తి కాకపోవడం వల్లే దానిని వినియోగించలేకపోతున్నాం. మిగిలిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. త్వరలో పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్



వేద విద్యార్థి శివరామకృష్ణకు పట్టా అందించిన కంచి పీఠాధిపతి

వేద విద్యార్థికి మూలపాటి పట్టా

ములుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తిరుపతిలో జరిగిన వేద పండితుల సదస్సులో కృష్ణ యజుర్వేద విద్యార్థి ఉప్పల శివరామకృష్ణకు 'మూలపాటి' పట్టా అందించారు. వర్గల్ శ్రీ శారదా స్మార్త వేద విద్యాలయం పూర్వ ప్రధాన ఆచార్యులు, ములుగు మండలం వంటిమామిడికి చెందిన ఉప్పల అనంతగిరి శర్మ, ఉప్పల శ్వేత దంపతుల కుమారుడే శివరామకృష్ణ. యజుర్వేద విద్యలో ప్రతిభ చాటిన శివరామకృష్ణను చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతి పట్టా సర్టిఫికెట్ ఇచ్చి, ప్రశంసించి, ఆశీర్వదించారు. తమ కుమారుడు శివరామకృష్ణ ప్రాచీన వేదాలు అభ్యసించి మూలపాటి పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని అనంతగిరి శర్మ, శ్వేత దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంచి పీఠాధిపతి మాట్లాడుతూ, వేదాలు ప్రాచీన సంపదకు మూలాలని, అవి నాలుగు పవిత్ర గ్రంథాల సముదాయమని స్పష్టం చేశారు. 'మూలపాటి' అనే పదం వేదాల, సనాతన గ్రంథాల ప్రామాణికతను సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో బీజేపీ జాతీయ నేత పూజలు



ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలకు పూజలు చేస్తున్న బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు

ఝరాసంగం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో ఆదివారం బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలకు, పంచావృక్షాలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ శాలువా, పూలమాలలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆశ్రమ చరిత్ర గురించి అవధూత గిరి మహారాజ్ మురళీధర్ రావుకు వివరించారు. ఆశ్రమంలో వేద పాఠశాల కొనసాగించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శేరి నర్సింగ్ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్కోటిక్ అధికారుల బృందం తనిఖీలు

జిన్నారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఓ పరిశ్రమకు చెందిన రసాయన నిలువలు దాచారని ఫిర్యాదు మేరకు నార్కోటిక్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. ఆదివారం గడ్డపోతారంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ గోదాంలో నిల్వ ఉంచిన రసాయన డ్రమ్ములు ఇతర పదార్థాలను నార్కోటి అధికారులు తనిఖీలు చేశారు. రాంకి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌కు తరలించాల్సిన పరిశ్రమకు చెందిన రసాయన పౌడరును డ్రమ్ములలో నిల్వ ఉంచారనే ఫిర్యాదుల మేరకు తనిఖీలు జరిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

మెదక్ కల్చరల్ , అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని కొంటూరు గ్రామం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్లితే చిన్న శంకరంపేట మండలం శంకర్ కొండాపూర్ గ్రామానికి చెందిన మూడ సాయిలు (22) మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యాడు కొంటూరు గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో సాయిలు తీవ్రంగా గాయపడి అక్కడే మృతి చెందాడు. అప్పుడే సమావేశం పూర్తిచేసుకుని మెదక్ నుంచి చేగుంట వైపు వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చిట్కుల మైపాల్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కారు ఆపి ఈ ఘటన ఎలా జరిగిందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయిలు మృతదేహం

చెరువులో కుళ్లిన మృతదేహం లభ్యం

నారాయణఖేడ్ అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేట శివారులోని కుపీలం చెరువులో కుళ్లిపోయిన మృతదేహం లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సిర్గపూర్ అంజనేయులు(32) వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లగా ఆంజనేయులు మృతదేహం పైకి తేలి కనిపించింది. మృతుడి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు నారాయణఖేడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సండే సందడి

హవేళిఘణపూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోచారం డ్యాం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. డ్యాంలో నిల్వ ఉన్న నీటి అందాలను తిలకించడానికి యువతీ యువకులు, కుటుంబ సమేతంగా ప్రజలు తరలివచ్చారు. ప్రకృతి అందాలను తిలకించడానికి వచ్చిన యువకులు అలుగు సమీపంలోని నీటిలో ఈత కొట్టగా, కుటుంబ సభ్యులతో వచ్చినవారు నీళ్లలో ఆడుతూ గడిపారు. ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ, ఉరకలు వేస్తున్న నీటిలో చిన్నారులు, మహిళలు స్నానాలు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించారు. పర్యాటకుల తాకిడితో డ్యాం పరిసరాలలో సందడి వాతావరణం నెలకొంది. అలుగు ప్రాంతం వరకు మాత్రమే పర్యాటకులను అనుమతించిన పోలీసులు, డ్యాం గెస్టహౌస్ వైపు వెళ్లకుండా ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో భద్రతను ఏర్పాటు చేశారు.

శిశువు మృతికి పోలియో చుక్కలు కారణం కాదు

- పోస్టుమార్టం నివేదికలో బయటపడుతుంది
- సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం భీమ్రా గ్రామంలో మూడు నెలల శిశువు మృతికి పోలియో చుక్కల మందు కారణం కాదని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రామంలోని పల్స్‌పోలియో బూత్‌కు తీసుకువచ్చారని, చుక్కల మందు వేసిన అనంతరం 12.30 గంటల వరకు పర్యవేక్షణలో ఉంచామన్నారు. ఈ సమయంలో శిశువు సాధారణంగానే ఉన్నారని ఎటువంటి ఇబ్బందులు కనిపించలేవన్నారు. అనంతరం తల్లిదండ్రులు శిశువును ఇంటికి తీసుకెళ్లారని సుమారు ఒంటి గంట సమయంలో శిశువు నిరంతరంగా ఏడుస్తున్నారని, ఒక సారి వాంతి అయ్యిందన్నారు. మళ్లీ తల్లిదండ్రులు బూత్‌కు తీసుకొచ్చారని వివరించారు. అయితే ఇంటికి చేరుకున్న తర్వాత బాటిల్ పాలు ఇచ్చినట్టు తల్లి తెలిపినట్టు ఆమె పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఆశా వర్కర్, వెంటనే శిశువును వైద్య పరీక్షల కోసం కంగ్టి పీహెచ్‌సీకి తీసుకెళ్లారని సూచించారు. తల్లిదండ్రులు శిశువును సుమారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో కంగ్టి గ్రామంలోని ఓ ప్రైవేటు డాక్టర్ వద్దకు తీసుకెళ్లారని, ఆ వైద్యుడు శిశువును పరిశీలించి కంగ్టి వైద్యాధికారికి సమాచారం అందించారన్నారు. వైద్యాధికారి అక్కడికి చేరుకుని పరిశీలించగా, పెదవులు నీలిరంగులోకి మారడం, ముక్కు వద్ద నుంచి నురుగు రావడం, శ్వాస ఆగిపోవడం గమనించామన్నారు. స్థానిక వైద్యుడు సుమారు మధ్యాహ్నం 2.15 గంటలకు శిశువు మృతి చెందినట్లుగా ప్రకటించారని డీఎంహెచ్‌వో తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారన్నారు. ఆహారం ఊపరితిత్తుల్లోకి వెల్లడంతో ఉత్పన్నమైన శ్వాస ఆడకపోవడం (ఆస్పిరేషన్)కారణంగా శిశువు మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. పోస్టుమార్టం తుది నివేదిక ఆధారంగా శిశువు మృతికి కారణం తెలిసే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.



బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో నేలను చూస్తున్న సీసీ కెమెరా

నిఘా నేత్రాలకు నిర్వహణ కరువు!

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- నేరాలు, ప్రమాదాలు గుర్తించడంలో జాప్యం

బెజ్జంకి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు) నిర్వహణ లేక మూలకు పడ్డాయి. నేరాలు జరిగితే గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కేవలం అలంకార ప్రాయంగా మారాయి. బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో గతంలో గ్రామ పంచాయతీలు, పోలీసులు, దాతల సహకారంతో సుమారు 200 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో చాలా వరకు కెమెరాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని కెమెరాలు నేలను చూస్తూ, మరికొన్ని కేబుల్ ఊడిపోయి, డ్యామేజ్ అయి కనిపిస్తున్నాయి.

కేసులు ఛేదించడంలో ఆలస్యం..

గ్రామాల్లో నేరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టి వెళ్లిపోగా, ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. ఘటన స్థలంలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కారును గుర్తించడంలో జాప్యం జరిగింది. అలాగే గుగ్గిళ్ల గ్రామంలో దొంగతనం జరిగినప్పుడు కూడా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దుండగులను పట్టుకోవడంలో జాప్యం జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో, రాజీవ్ రహదారి వెంట పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పాడైన సీసీ కెమెరాలను బాగు చేయిస్తాం..



కోతుల బెడదతో చాలా గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని ప్రజల సహకారంతో బాగు చేయిస్తాం. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్థులు, దాతలు ముందుకు రావాలి.

-బి. సౌజన్య, ఎస్ఐ, బెజ్జంకి



బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్‌రహదారిపై పని చేయని సీసీ కెమెరాలు

ప్రాథమిక అనారోగ్య కేంద్రం



పీహెచ్‌సీ చుట్టూ మురుగు నీటి గుంటలు

- మనోహరాబాద్ పీహెచ్‌సీలో సమస్యల తిష్ఠ
- ఆస్పత్రి ఆవరణ చుట్టూ మురుగు నీటి గుంటలు
- విద్యుత్ లేక రోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

మనోహరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల తీరు మాత్రం మారడం లేదు. మెదక్ జిల్లా, మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఆసుపత్రి భవనం నిర్మించినా, అందుకు తగ్గట్టుగా వైద్య సిబ్బందిని, ఇతర సౌకర్యాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రిలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

మూడు రోజులు చీకట్లో ఆసుపత్రి

గత నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా మనోహరాబాద్ ఎల్లమ్మ చెరువు అలుగు పారింది. కాలువ పక్కనే ఉన్న పీహెచ్‌సీ చుట్టూ వరద నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా, ఆ రోజు వర్షం కారణంగా ఆసుపత్రిలో మూడు రోజులపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ విషయంపై ఆసుపత్రి అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని సిబ్బంది తెలిపారు. విద్యుత్ లేని సమయంలోనే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ రవీందర్ నాయక్ ఆసుపత్రిని సందర్శించారు. కానీ, మండల వైద్యాధికారి విద్యుత్ లేని విషయాన్ని డైరెక్టర్‌కు చెప్పకపోవడం విస్మయానికి గురిచేసింది. చివరకు, మనోహరాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కృష్ణాగౌడ్ తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించడంతో మూడు రోజుల తర్వాత నామమాత్రంగా కరెంటు వచ్చింది. విద్యుత్ లేక వ్యాక్సిన్లను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచలేక వెల్దుర్తి, తూప్రాన్ ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చింది.

సిబ్బంది కొరత, దోమల బెడద

ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత కూడా ఇబ్బందులు సృష్టిస్తోందని సిబ్బంది తెలిపారు. ఇద్దరు స్టాఫ్ నర్సులకు ఒక పోస్టు, ఒక పీహెచ్ఎన్ (పబ్లిక్ హెల్త్ నర్స్) పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రి గ్రామ శివారులో ఉండటం, రాత్రి వేళల్లో పాములు లోపలికి వస్తుండడం భయాందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా, ఆసుపత్రి చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో దోమలు, పాముల బెడద ఎక్కువైంది. ఇక జాతీయ రహదారి నుంచి ఆసుపత్రికి వెళ్లే మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయమై బురదతో నిండిపోవడంతో ఆసుపత్రికి రావడం రోగులకు నరకంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి వేళ ఆసుపత్రి బయట వేచి చూస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

రోడ్లు ఇలా.. పట్టించుకోరా..?



శుభోదయ నగర్‌లో దెబ్బతిన్న రోడ్డు

- చేర్యాలలో పెద్దచెరువు మత్తడి వరదనీటితో దెబ్బతిన్న రోడ్డు
- కంకర తేలి గుంతలమయంగా మారడంతో ఇక్కట్లు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు

చేర్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శభోదయనగర్ కాలనీలోని ప్రధానరహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇటీవల కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు పట్టణంలోని పెద్దచెరువు మత్తడిదూకింది. కాలువను అర్ధాంతరంగా వదిలేయడంతో 5, 7 వార్డుల పరిధి గుండా వరదనీరు ప్రవహించి శుభోదయనగర్ కాలనీలో మోకాలిలోతు వరకు నీరు చేరింది. అలాగే జనావాసాల్లోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులుపడిన విషయం విదితమే. పట్టణం నుంచి యాదవనగర్, గట్టుతోటకు వెళ్లే ప్రధాన మార్గంలో వికాస్ గ్రామర్‌స్కూల్, శుభోదయ, పంచతంత్ర పాఠశాలలున్నాయి. ఈ దారిగుండా బస్సులు, వాహనాల్లో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వికాస్‌స్కూల్‌కు చేరువన రోడ్డుకోతకు గురి కావడంతో పాటు బీటీ లేచి కంకర తేలింది. సమీప ప్రదేశం గుంతలమయమైంది. గోతికి చేరువన సీసీ రోడ్డు ఎత్తుగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు, వాహనదారులు నానాతంటాలు పడుతున్నారు. రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొద్యం వీడి రోడ్డుపై గుంతలు పూడ్చాలని, వరదనీరు జనావాసాల్లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వికాస్‌గ్రామర్‌స్కూల్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా తయారైన గొయ్యి



చిన్నకోడూరు-ఇబ్రహీంనగర్ రోడ్డుపై కమ్ముకున్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు

చిన్నకోడూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఇబ్రహీంనగర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు దారికి అడ్డంగా పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్నకోడూరు గ్రామ శివారులోని శేరిపల్లి వీరాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే భక్తులతో పాటు, పలు గ్రామాలకు వెళ్లే వాహనాదారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు ఆ రోడ్డు పైనుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం కావడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలు ఏపుగా పెరిగి రోడ్డు పైకి రావడంతో వాహనదారులు, రైతుల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలు కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, వాహనాలు అతి సమీపంలోకి వచ్చే వరకూ కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కమ్ముకున్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలను తొలగించాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

రైతుల మేలు కోసమే కొనుగోలు కేంద్రాలు



గుగ్గిళ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రేగులపల్లి, గుగ్గిళ్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సుధీర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం పరశురాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, సంతోష్, లింగం, శ్రీనివాస్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటుచేయడంలో విఫలం



ఖాజీపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులపట్ల మొసలికన్నీరు కారుస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాయితీపై మొక్కజొన్న విత్తనాలు



పూజా, ఏవో

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎం) పథకంలో భాగంగా 2025 యాసంగి సీజన్ కోసం మొక్కజొన్న విత్తనాలను రైతులకు రాయితీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజా తెలిపారు. జాతీయ విత్తన సంస్థ ద్వారా విడుదలైన ఎన్‌ఎస్‌సీ సీటీ 4260 రకం 4 కేజీల బ్యాగ్‌ను రూ.1,380 ధర ఉండగా రైతుల కోసం రాయితీపై రూ.980 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు తమ భూమి పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను సంబంధిత ఏఈవోలకు అందచేయాలని కోరారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన యువకులు



కాసులాబాద్‌లో రోడ్డుపై గుంతలను పూడుస్తున్న యువకులు

మిరుదొడ్డి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులాబాద్ గ్రామంలో రోడ్డు గుంతలు పడడంతో గ్రామానికి చెందిన యువ నాయకుడు రాజు ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలను పూడ్చారు. రోడ్డుపై గుంతలవల్ల వాహనదారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా నివారించేందుకు గుంతల్లో మట్టినిపోసి పూడ్చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



మాజీ ఎంపీపీ సంధ్య కుటుంబీకులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

దౌల్తాబాద్, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గంగాధరి సంధ్యా రవీందర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ దౌల్తాబాద్ మండల మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ఆదివారం గంగాధరి సంధ్యా రవీందర్‌లను పరామర్శించారు. అదేవిధంగా దొమ్మాట గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రావు, నక్క సురేష్ సైతం మాజీ ఎంపీపీని పరామర్శించారు. పరామర్శించినవారిలో బీజేపీ నాయకులు కిషన్, బొల్లం స్వామి, సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



జోగిపేటలో స్వయం సేవకుల కవాతు

జోగిపేట, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలను జోగిపేటలో స్వయం సేవకులు ఘనంగా నిర్వహించారు. ఖండ సంచాలక్ తీర్థాల సుబ్రహ్మణ్యం, జిల్లా సహ బౌద్ధిక్ ప్రముఖ్ మేకల సురేశ్‌ల ఆధ్వర్యంలో స్వయంసేవకులంతా.. పట్టణంలోని క్లాక్‌టవర్ నుంచి పట్టణ శివార్లలోని శ్రీరామాగార్డెన్స్ ఫంక్షన్‌హాల్ వరకు గణవేశ (యూనిఫార్మ్) ధరించి చేతిలో లాఠీ, కాషాయ ధ్వజాలను చేతబూని కవాతు నిర్వహించారు. అనంతరం, శ్రీరామాగార్డెన్స్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో .భరతమాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్, గురూజీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్త మేకల సురేశ్ మాట్లాడుతూ... హిందూ ధర్మ రక్షణ కోసమే ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో అందోలు-జోగిపేట జంట పట్టణాలతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన సస్వయం సేవకులు పదుల సంఖ్యలో హాజరైనారు.

న్యూస్ బాక్స్

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నకోడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతసాగర్‌లో గ్రామ పంచాయతీ కార్మికుడు మెట్ల సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న దిశా కమిటీ జిల్లా మెంబర్ వనజ, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బాపయ్య ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు.

బ్రిడ్జి లేక తప్పని ఇక్కట్లు



బిడెకన్నె గ్రామ సమీపంలో వాగు గుండా ప్రవహిస్తున్న వరద నీరు

ఝరాసంగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ సమీపంలో వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రాకపోకలు కొనసాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రమైన ఝరాసంగానికి వెళ్లాలంటే క్రిష్టాపూర్, మాచూనూర్, కుప్పానగర్ గ్రామాలమీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మిస్తే దూరభారం తగ్గుతుంది. కొన్నేళ్ల క్రితం కుప్పానగర్ కంకర మిషన్ పక్క నుంచి బిడెకన్నె వరకు మెటల్ రోడ్డు వేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సుమన్ నుంచి బ్లాక్‌బెల్ట్ ప్రదానం



సంగారెడ్డి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో నిర్వహించిన కరాటే బూడోకాన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో సంగారెడ్డికి చెందిన కరాటే మాస్టర్ బాబులాల్‌కు బ్లాక్ బెల్ట్ 8వ డాన్ వరించింది. బ్లాక్ బెల్ట్‌ను బూడోకాన్ కరాటే అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, సినీనటుడు సుమన్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలికలు, మహిళలు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ పొందాలని సూచించారు. పేద విద్యార్థులు, బాలికలకు కరాటేలో ఉచిత శిక్షణ అందిస్తానని తెలిపారు.

పీఆర్టీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) మెదక్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మేడి సతీష్‌రావు ఎన్నియ్యారు. మెదక్‌లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, భిక్షంగౌడ్ ఆధ్వర్యంలో సతీష్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మానయ్య, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని సతీష్‌రావు తెలిపారు.

రోడ్డుపైనే విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం



తోర్నాల,రావురూకుల గ్రామాల మధ్య బీటీ రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

సిద్దిపేట రూరల్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ఓ పక్కన వేయాల్సిన విద్యుత్ స్తంభం రోడ్డుపైనే ఏర్పాటు చేయడంతో ప్రమాదం పొంచిఉందని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల, రావురూకుల గ్రామాల రోడ్డులో ఓ ప్రైవేటు పరిశ్రమకు విద్యుత్‌శాఖ 11కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఓ పక్కన వేయాల్సి విద్యుత్ స్తంభం బీటీ రోడ్డుమధ్యలోనే ఏర్పాటు చేయడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సమస్యను సత్వరమే పరిష్కరించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చీరలు వచ్చేశాయ్!

(5వ పేజీ తరువాయి)



సిద్దిపేటలోని వ్యవసాయ మార్కెట్‌లోని గోదాం

కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బతుకమ్మ చీరల పంపిణీని ఆపేసింది. దీంతో ఈ ఏడాది మహిళలందరికీ కాకుండా కేవలం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే యూనిఫామ్ చీరలను అందించాలని నిర్ణయించింది. తొలుత సంఘాల సభ్యులకు బతుకమ్మకు అందించాలని భావించినప్పటికీ సాధ్యపడలేదు. దానికి తోడు ఎన్నికల షెడ్యూల్ రావడంతో అది కాస్త బ్రేక్ పడింది. ఎన్నికలకు సంబంధించి పలువురు కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు ఆరు వారాల పాటు వాయిదా పడ్డాయి. ఎన్నికల కోడ్ లేకపోవడంతో ఇందిరా గాంధీ జయంతి రోజున చీరలను సిద్ధం చేసి, పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



పంచాయతీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్

నంగునూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరులో పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 24, 25న గార్ల పట్టణంలో జరిగే గ్రామపంచాయతీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించబోతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు మల్టీపర్పస్ విధానం రద్దు చేయకపోవడం శోచనీయమన్నారు. మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చ జరిపి రానున్న కాలంలో కనీస వేతనం రూ.26వేల చెల్లించేలా చర్యలు చేపడతామన్నారు.మల్టీ పర్పస్ విధానం రద్దు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యంతో పాటు ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య, నాయకులు బాలయ్య, కనకయ్య, శేఖర్, పరశురాములు, కిషన్, బాలరాజ్, దేవులపల్లి దేవవ్వ, కళావతి, కనకలక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

తొగుట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తున్నదని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ స్పష్టం చేశారు. ఆదివారం తొగుటలో నిర్వహించిన గ్రామపంచాయితీ మండలస్థాయి కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 9,10 తేదీలలో సిద్దిపేట లో సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో వచ్చేనెల 9,10న జరిగే సీఐటీయూ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులున్నారు.

సంగమేశ్వర్ ప్రాజెక్టును రద్దు చేసింది దామోదరే..



అలయ్ బలయ్‌లో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

మునిపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంగమేశ్వర ప్రాజెక్టును నిర్మిస్తే.. ఇప్పుడు ఆ ప్రాజెక్టును రద్దు చేసింది మంత్రి దామోదర్ రాజనర్సింహనే అని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. క్రాంతికిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. ఆరు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. అనంతరం పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షిసాయికుమార్ మాట్లాడుతూ పీఎస్ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది ప్రజలకోసమేనని తెలిపారు. అంతకు ముందు దుర్గా భవానీమాతకు, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మాసన్‌పల్లి నారాయణ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, పుల్కల్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఆనంద్, మైనారిటీ అధ్యక్షుడు మౌలానా, నాయకులు పాల్గొన్నారు.

పది నెలలు గడిచినా.. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అందని డబ్బు

- కులగణన సర్వే ఆన్‌లైన్ నమోదు కోసం మండలంలో చెల్లించాల్సినవి రూ.98 లక్షలు



కులగణన సర్వేను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

మద్దూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో అప్లికేషన్‌కు రూ.30 చొప్పున ఇస్తామని అధికారులు చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఇలా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా వ్యాప్తంగా రావల్సిన రూ.98 లక్షలు 10 మాసాలైనా అందకుండా పోవడంతో బాధితులు ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత ఏడాది నవంబరు 28 నుంచి డిసెంబరు 3 వరకు నిర్వహించిన కుల గణన సర్వేను ఆన్‌లైన్‌లో పొందు పర్చేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసి సొంత కంప్యూటరు కల్గిన ఆపరేటర్లు కావాలని ప్రకటించారు. ఒక్క మద్దూరు మండలంలోనే 6,658 అప్లికేషన్లు వచ్చాయి. దీంతో అధికారులు సమకూర్చిన కంప్యూటర్లు సరిపోకపోవడంతో ఆపరేటర్లు సొంతంగా కంప్యూటర్లు తెచ్చుకుని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టారు. సుమారు 60 మందికి లాగిన్ ఇచ్చారు. ఒక్కో అప్లికేషన్ ఆన్‌లైన్ చేసినందుకు మొదట రూ.30 చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆపరేటర్లు రాత్రింబవళ్లు కష్టపడి వివరాలను ఆన్‌లైన్ నమోదు చేశారు. అయితే పని పూర్తి కాగానే డబ్బులు అందిస్తామన్న అధికారులు మొహం చాటేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా రూ.98 లక్షలు రావల్సి ఉండగా అందులో ఒక్క మద్దూరుకే రూ. 1,99,740 లు రావల్సి ఉన్నాయి. స్థానిక అధికారులు ఆపరేటర్ల అకౌంట్లలో డబ్బులు జమచేస్తామని చెప్పి వారి బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకున్నారు. మొదటగా తహసీల్దార్ల అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని, అనంతరం ఆపరేటర్ల అకౌంట్లలోకి బదిలీ చేస్తామని చెప్పారు. అయితే ఒక్కో అప్లికేషన్‌కు ఇస్తామన్న రూ. 30లు కాకుండా రూ.25 మాత్రమే చెల్లిస్తామని చెప్పడంతో ఆపరేటర్ల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ఒక్కో ఆపరేటర్ చేపట్టిన అప్లికేషన్ వివరాల ప్రకారంగా ఎవరెవరికి ఎంత రావల్సి ఉందో అదేవిధంగా లెక్కలు చేసి పెట్టి పై అధికారులకు జాబితాను అందించినట్లు తెలిపారు.

కాగా ట్రెజరీలో డబ్బులు జమయ్యాయని చెప్పి, ఆ తర్వాత ల్యాప్స్ అయ్యాయని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. 10 మాసాలైనా ఆపరేటర్లకు డబ్బులు అందకుండా పోవడంతో డబ్బులు వచ్చాయా అంటూ కార్యాలయాల చుట్టూ తిరగడం ఆపరేటర్లవంతయ్యింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కులగణన సర్వేను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఆపరేటర్లకు రావల్సిన డబ్బులు అందించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.